క్లుప్తంగా

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ



మీరాఖాన్‌పేటలో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

యాచారం: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ సూచించారు. పీఎస్ పరిధిలోని మీరాఖాన్‌పేటలో గురువారం ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగల సమయాల్లో బంధువుల ఇళ్లకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులు, నగదు, ఆభరణాలను జాగ్రత్తగా పెట్టుకుని వెళ్లాలని సూచించారు. ప్రతీ ఇంటి వద్ద సీసీ కెమెరాలు బిగించుకునేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వంశీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ



రాంపూర్ పాఠశాలకు మైక్‌సెట్ అందిస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండలంలోని రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి బుధవారం వైర్‌లెస్ మైక్‌సెట్, సౌండ్ బాక్స్‌లను అందజేశారు. అలాగే పాఠశాలలో కంప్యూటర్ టేబుల్స్ కోసం లయన్స్‌క్లబ్ సభ్యుడు మోహన్‌రెడ్డి రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యుడు మోహన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, తపస్ మండల శాఖ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు నవీన్‌కుమార్, భిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల అదుపు

ఎస్ఐ వరప్రసాద్



విరాళం అందజేస్తున్న పాత్లవత్ శ్రీధర్

కడ్తాల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపు చేయొచ్చని ఎస్ఐ వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేఖ్యాతండాకు చెందిన పాత్లవత్ శ్రీధర్ రూ.25వేలు, పాత్లవత్ కృష్ణనాయక్ రూ.10వేలు, సామాజిక సేవలో భాగంగా, సీసీ కెమెరాల ఏర్పాటునకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. కాబట్టి వాటిని ఏర్పాటు చేసుకోవడంతో భద్రత ప్రమాణాలు మెరుగుపడుతాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు, చోరీల నివారణకు, నిందితులను గుర్తించి శిక్ష పడేలా చేసేందుకు ఇవి ఉపకరిస్తాయన్నారు. ఈ విషయంలో దాతలు ముందుకొచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ రాములు, రేఖ్యాతండా వాసులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు సిద్ధం



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

ఇబ్రహీంపట్నం: పంద్రాగస్టు వేడుకలకు పట్నంలో అంతా సిద్ధమైంది. శుక్రవారం నిర్వహించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, వివిధ రాజకీయ పక్షాలు మువ్వన్నెల జెండాలను ఎగురవేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్, వ్యవసాయ, ఐకేపీ, మున్సిపల్ కార్యాలయాలను విద్యాసంస్థలను రంగురంగుల కాగితాలతో విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ వేడుకల సందర్భంగా నిర్వహించనున్న సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రత్యేకంగా విద్యార్థినులు శిక్షణ తీసుకుంటున్నారు. విద్యాసంస్థల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నారు.

సంతకాలకు చెక్!

సమయ పాలన తప్పనిసరి

- ఎంపీడీఓ కార్యాలయాల్లో ఫేస్ రికగ్నైజేషన్ యంత్రాలు
- ఉద్యోగుల, సిబ్బంది హాజరు ఆన్‌లైన్లోనే
- పాలనలో సమూల మార్పు
- పకడ్బందీగా అధికారుల అటెండెన్స్



ఎంపీడీఓ కార్యాలయం, ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం రూరల్: అధికారుల, సిబ్బంది తీరులో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం కొత్త చర్యలు చేపట్టింది. సమయపాలన తప్పనిసరి చేస్తూ ఫేస్ రికగ్నైజేషన్ యంత్రాలతో హాజరు నమోదు చేయనుంది. ఇకపై సమయానికి రాని వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేసింది. ప్రభుత్వ శాఖల్లో పని చేసే అధికారులు నిరంతరం సమయానికి రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది అధికారులు 12 గంటలకు వచ్చి లంచ్ చేసి సాయంత్రం 5 గంటలకు ముందే తిరిగి ఇళ్లకు వెళ్లిపోతుండడంతో ఫేస్ రికగ్నైజేషన్ యంత్రాలను తీసుకొచ్చింది. ఏది ఏమైనప్పటికీ సబార్డినేట్‌లనుంచి మొదలు కొని ఉన్నతాధికారుల వరకు సమయ పాలన పాటించాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేసింది.

మండల పరిషత్ కార్యాలయాల్లో..



ఫేస్ రికగ్నైజేషన్ యంత్రం

మండల పరిషత్‌లు ఏర్పడినప్పటి నుంచి మొన్నటి వరకు అధికారుల హాజరు రకరకాలుగా ఉండేది. ఆఫ్‌లైన్ ద్వారానే నమోదు చేసేవారు. అటెండర్ నుంచి ఎంపీడీఓల వరకు సంతకాలు చేసేవారు. ఆఫ్‌లైన్‌తో ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎప్పుడు వచ్చినా సంతకాలు పెట్టడానికి వీలుండేది. అలాంటి వాటికి చెక్ పెడుతూ కొత్త విధానం తీసుకొచ్చారు. నెల రోజుల క్రితం తెలంగాణ ప్రభుత్వం నూతన హాజరు విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని మండల ప్రజాపరిషత్తు కార్యాలయాల్లో నెల రోజులుగా బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నారు. దీంతో ప్రతిఒక్కరూ ఉదయం 9.30 గంటలకు హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది.

సంతకాలకు కాలం చెల్లు

గతంలో ప్రతీ రోజు ఆయా కార్యాలయానికి వచ్చే వారు తప్పనిసరిగా సంతకాలు చేయాల్సి ఉండేది. గ్రామ పంచాయతీల్లో పని చేసే పంచాయతీ కార్యదర్శులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆన్‌లైన్ అటెండెన్స్ అలవాటు చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శులకు ఇలా ఎందుకు పెట్టారని అనేక మార్లు ప్రశ్నించారు. వీరికి తోడుగా మండల ప్రజాపరిషత్ ఉద్యోగులకు కూడా ప్రస్తుతం ఈ విధానం అమలులోకి తీసుకురావడంతో సంతకాలకు కాలం చెల్లింది.

సులభతరం..



20 రోజుల క్రితం బయోమెట్రిక్ యంత్రాలు అమర్చారు. గతంలో సంతకాలు చేసే వాళ్లం. ప్రస్తుతం సంతకాలు చేయకుండా మిషన్‌లో చేయి పెడితే మనల్ని అది గుర్తించి హాజరు నమోదు చేస్తుంది. అటెండెన్స్ కోసం పుస్తకాల కొనుగోలు తప్పింది. సంతకాలు పెట్టడానికి పోటీ పడే అవసరం కూడా లేకుండాపోయింది. ఒక్కోసారి ఉద్యోగానికి వచ్చామని మర్చిపోయి సంతకాలు పెట్టకపోవడంతో నష్టాలు జరిగేవి. ఇప్పుడు బయోమెట్రిక్‌తో అంతా సులభతరం అయ్యింది.

– కుమార్ అటెండర్, మండల ప్రజాపరిషత్

ఉద్యోగులు అందరూ సమానమే



బయోమెట్రిక్ విధానం అమలు చేయడం వల్ల పొద్దున, సాయంత్రం రెండు సార్లు హాజరు వేయాల్సిందే. ఎవరు కూడా ఈ విషయంలో తప్పించుకోవడానికి వీలులేదు. ఉద్యోగంలో పారదర్శకత పెరుగుతుంది. ప్రతిఒక్కరూ సమయ పాలన పాటిస్తారు. ఈ విధానం ఎవరికీ మినహాయింపు కాదు. ఉద్యోగులు అందరూ సమానమే.

– ఎల్లంకి జంగయ్య, సూపరింటెండెంట్

పట్నంలో బీజేపీ తిరంగా యాత్ర



ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడులో జాతీయ జెండాలతో పురవీధుల్లో ర్యాలీ



ఇబ్రహీంపట్నలో బీజేపీ తిరంగా యాత్ర

ఇబ్రహీంపట్నం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో తిరంగా యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, రాంరెడ్డి, పి.మహేందర్, శ్రీనివాస్, రాఘవేంద్రస్వామి, సరేష్, గోవర్ధన్, సంతోష్, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్మినేడులో జాతీయ జెండాలతో ర్యాలీ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతీ ఒక్కరిలో దేశభక్తి ఉండాలని బీజేపీ రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్ పేర్కొన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచేత 79 అడుగుల భారీ జాతీయ జెండాను పురవిధుల్లో ప్రదర్శించారు. జాతీయ జెండాలను చేతపట్టుకొని దేశభక్తి చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోరెడ్డి నర్సింహారెడ్డి, బాలశివుడు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, మహేందర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ

- కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రజలకు విసుగు
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ వార్డుసభ్యులు బండ మహేందర్, బండ బాల్‌రాజ్, చిట్టెం శివలింగంలతో పాటు పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హిందూ, ముస్లింల మధ్యల బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందుతోందన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలపై విసుగు చెంది ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులు మళ్లీ సొంతగూటికి వస్తారన్నారు. భవిష్యత్తు అంతా బీఆర్ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండ నర్సింహ పలువురు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కెనరా బ్యాంక్ అండ

అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అక్షయమూర్తి



చెక్కులను అందజేసిన అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అక్షయమూర్తి

ఇబ్రహీంపట్నం: ప్రతిభగల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కెనరా బ్యాంక్ అండగా ఉంటుందని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అక్షయమూర్తి పేర్కొన్నారు. కెనరా బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ వై.సీహెచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, కోహెడ, గుమ్మడవెల్లి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రతిభావంతులైన 24 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. మూడు నుంచి ఐదు వేల చొప్పున స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అందజేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను విద్యాజ్యోతి పథకం కింద ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో పేద విద్యార్థులు చదువుకు దూరం కావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ శశికాంత్, జిల్లా రీజినల్ ఆఫీసర్ పావని, స్థానిక బ్రాంచ్ మేనేజర్ వరకుమార్, కోహెడ మేనేజర్ హీరామణినాయక్, మండల విద్యాధికారి హీర్యానాయక్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పి. పరమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాటసింగారం-మజీద్‌పూర్, గుంతపల్లి-మజీద్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్-లష్కర్‌గూడ మధ్య వంతెనలపై నుంచి వరద పెరిగే అవకాశాలున్నాయని, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా హెచ్చరిక బోర్డులు, బారీ కేడ్లు ఏర్పాటు చేయాల్సిందిగా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆయా గ్రామాల్లోని వంతెనలతో పాటు మండలంలోని పలు పాతబడిన బావులను, పాత ఇళ్లను ఆయన గురువారం రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రాంబాబు, ఇందిరరాణి, సిబ్బంది పాల్గొన్నారు.



బాటసింగారం-మజీద్‌పూర్ వంతెనను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

చేపల వేటకు వెళ్లొద్దు

మాడ్గుల: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతవాసులు జాగ్రత్తగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మాడ్గుల మండల పరిధిలోని సుద్దపల్లి వాగు, చెరువులను ఆయన స్పెషల్ పోలీసు సిబ్బందితో సందర్శించి, ప్రజలకు, మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్సకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. ఎలాంటి విపత్తు కలిగిన పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏసీపీతో పాటు సీఐ వేణుగోపాల్ రావు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



మాడ్గుల: సుద్దపల్లి గ్రామంలో వాగును పరిశీలిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

సమస్యలు పరిష్కరిస్తా

ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి



ఆమనగల్లులో కళాశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కళాశాలను సందర్శించారు. కళాశాలలో గదులను పరిశీలించారు. విద్యార్థులు, ప్రిన్సిపల్ మాధవరావ్‌తో ఎమ్మెల్యే మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గదులు కళాశాల నిర్వహణకు సరిపోవడం లేదని, ఆరుబయట వరండాలో తరగతులు నిర్వహించాల్సి వస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇదే భవనంలో డిగ్రీ కళాశాల కూడా నిర్వహించడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కళాశాల సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ వివాదం కారణంగా కళాశాల భవన నిర్మాణం ఆగిపోయిందని వీలైనంత త్వరగా నిర్మాణ పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఒకే ప్రాంగణంలో ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కడ్తాల మండలం చరికొండ గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి చరికొండ కాంగ్రెస్ నాయకులు అద్దాల మహేందర్, హరిశ్చంద్ర, మహేందర్, హరికృష్ణలు కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. చరికొండలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, అంతర్గత రోడ్లు బాగు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

ప్రొటోకాల్ పాటించకపోవడం బాధాకరం

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్



మాట్లాడుతున్న హరిప్రసాద్

ఆమనగల్లు: మున్సిపాలిటీలోని బీసీ బాలుర వసతిగృహ భవన నిర్మాణ శంకుస్థాపనకు ప్రొటోకాల్ పాటించక పోవడం బాధాకరమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయం గురించి జిల్లా కలెక్టర్, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. శిలాఫలకంపై కూడా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ పేరు ఎలా పెడతారని ప్రశ్నించారు. ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రభుత్వ కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా మార్చారని ఆరోపించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి అధికారులపై ఒత్తిడి తెచ్చి పదవిలేని వారిపేరును శిలాఫలకంపై రాయనీయలేదన్నారు. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తే బీజేపీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హరిప్రసాద్ హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో నర్సింహా, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

చల్లంగా చూడమ్మా పోచమ్మ తల్లి



కడ్తాల్: కర్కల్‌పహాడ్‌లో బోనాలతో మహిళలు, యువతులు



ఆమనగల్లులో బోనాల ఊరేగింపు

వైభవంగా బోనాలు

కడ్తాల్: కర్కల్‌పహాడ్‌లో గురువారం పోచమ్మ తల్లి బోనాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బ్యాండు మేళాలు, డోలు వాయిద్యాల చప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పోచమ్మ ఆలయానికి చేరుకుని నైవేద్యం, తీపి వంటకాలను అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు, యువకుల నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు అకట్టుకున్నాయి.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో శ్రీకృష్ణ యాదవసంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి బోనాలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పట్టణంలోని పెద్దమ్మ దేవాలయంలో నిర్వహించిన పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మార్కెట్ చైర్మన్‌గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ మాజీ వైస్‌చైర్మన్ తోట గిరియాదవ్, నాయకులు తోట శ్రీనివాస్, నర్సింహా, జంగయ్య, ఎర్రయ్య, మల్లేశ్, పర్వతాలు, శేఖర్, చంద్రయ్య, శివ, కృష్ణ, నందు, బందయ్య, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించుకున్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థినులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల్లో శారీరక, మానసిక, సామాజిక అవగాహనను పెంపొందిస్తూ వాయిస్ ఫర్ గరల్స్ ఆధ్వర్యంలో పదిరోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ లలిత మాట్లాడుతూ విద్యార్థినులు శారీరక, మానసిక, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి గోపాల్‌నాయక్, ప్రధానోపాధ్యాయురాలు విమల, వాయిస్ ఫర్ గరల్స్ కోఆర్డినేటర్ స్పందన, కౌన్సిలర్లు కీర్తన మహాలక్ష్మి, వేద తదితరులు పాల్గొన్నారు.

కాల్వపారింది.. నీరు చేరింది

- నిండుతున్న చెరువులు, కుంటలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు




ఇబ్రహీంపట్నం రూరల్: ఉప్పరిగూడ ఫిరంగి నాలా నుంచి పెద్ద చెరువులోకి చేరుతున్న నీరు

ఇబ్రహీంపట్నం రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ఇబ్రహీంపట్నం మండలంలోని ఫిరంగి నాలా పారింది. ఆదిబట్ల, ఎంపీ పటేల్‌గూడ, మంగళ్‌పల్లి మీదుగా ఉప్పరిగూడ నుంచి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. కాల్వ పారి చెరువులోకి నీరు వస్తుండటంతో ప్రజలు పెద్ద ఎత్తున వెళ్లి చెరువును వీక్షిస్తున్నారు. ఎగువ నుంచి భారీ వరద వస్తే మరో మారు చెరువు నిండనుంది.

అలుగు పారుతున్న చెరువులు..

కడ్తాల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో పలు చెరువులు నిండాయి. కొన్ని చెరువులు, కుంటల్లోకి కొంత మేరకు నీరు చేరింది. రెండు రోజులుగా మండల కేంద్రంలో కురిసిన వర్షానికి గురువులకుంట చెరువు, దేవర చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. గురువుల కుంట చెరువు నిండి అలుగు పారుతుండటంతో తండావాసులు రాక పోకలకు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురుస్తుండడంతో భూగర్భ జలాలు పెరిగి, పంటలు సమృద్ధిగా పండుతాయని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కడ్తాల్: అలుగు పారుతున్న గురువుల కుంట చెరువు